సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 8 । మే । 2025



ఆకాశ పందిరిలో..

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి వధూవరులైన శుభ తరుణంలో రత్నగిరి పులకించింది.


- 10లో▸



నిత్యాన్నదానానికి రూ.2.5 లక్షల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి నిత్యాన్నదానానికి త్సల్లా సుబ్రహ్మణ్యకృష్ణభాస్కర్-లక్ష్మీమానస దంపతులు (నరేంద్రపురం) రూ.2,50,000 విరాళంగా అందజేశారు.

1,987 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,987 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

టీచర్ లక్ష్మీ రంగమ్మకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం



రాష్ట్ర స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న వాసంశెట్టి లక్ష్మీ రంగమ్మ

రామచంద్రపురం రూరల్: మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి లక్ష్మీ రంగమ్మ గురుకుల పాఠశాలలకు సంబంధించి రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె బోధించే హిస్టరీ సబ్జెక్టులో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చేతుల మీదుగా అందజేశారు. కాకినాడ జిల్లా చొల్లంగిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. 2025 పదో తరగతి పరీక్షల్లోను, ఇంటర్మీడియెట్‌లోను నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులవడమే కాకుండా, ఈ పాఠశాలకు చెందిన ఎ.దివ్య ఇంటర్‌లో వెయ్యి మార్కులకు 949 మార్కులు సాధించి గురుకుల పాఠశాలల్లో జిల్లా మొదటి స్థానం సాధించింది. ఆమె కూడా బెస్ట్ స్టూడెంట్‌గా ఎంపికకావడంపై ప్రిన్సిపాల్ పద్మావతి, సహచర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు జరుగుతాయని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ పరీక్షల్లో విధులు నిర్వర్తించే పరీక్షల కమిటీ సభ్యులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమీక్షలో సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రథమ సంవత్సరం పరీక్ష ఉంటుందన్నారు. అదే ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో డీఆర్వో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై వివిధ శాఖలను సమన్వయం చేస్తూ సమీక్షించారని డీఐఈవో తెలిపారు. పరీక్షలన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు యాళ్ల లక్ష్మణరావు, దేవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మెడలు వంచి కొనిపిస్తాం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు అవినీతి అమరావతిపై ఉన్న ప్రేమ రాష్ట్రంలో అష్ట కష్టాలు పడుతున్న అన్నదాతలపై లేదు. రబీ ధాన్యం అమ్ముకునే దిక్కులేక రైతులు పడుతున్న అవస్థలను చూసైనా ఆయన మొద్దు నిద్ర వీడాలి. లేకుంటే వైఎస్సార్ సీపీ కూటమి ప్రభుత్వం మెడలు వంచి ధాన్యం కొనిపిస్తుంది. అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తానని చెప్పుకొనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ధాన్యం కొనుగోళ్ల విషయంలో పత్తా లేకుండా పోయారు. పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని జన సైనికుల అంటున్న క్రమంలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన ప్రశ్నించేలా లేరు.

– చిర్ల జగ్గిరెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నాటి శ్రద్ధ నేడు ఏదీ?



దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు రైతు సమస్యలపై మనసు పెట్టి స్పందించిన తీరు నేటి కూటమి ప్రభుత్వ పాలనలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఎంత మాత్రం లేదు. ఈ రబీలో దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నులు పండితే అధికారులు కేవలం 5.8 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండిందని లెక్కలు కట్టారు. దానిలో రెండు లక్షల మెట్రిక్ టన్నులు కొంటామనడం సరికాదు.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైంది. లాభసాటి ధర ఎలాగూ ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం రైతుకు బీమా చేసి ఆదుకుంది. ఈ ప్రభుత్వం ఈ భారాన్ని రైతులపై పెట్టి బీమా చేస్తేనే పంట రాయితీ అని మెలిక పెడుతోంది. దీని వెనుక అన్నదాతపై వీరికున్న ప్రేమ ఏపాటిదో అర్థమవుతోంది. ఈ ప్రభుత్వం రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్‌తో కుమ్మక్కై, రైతుల నుంచి ధాన్యాన్ని అయినకాడికి దోచుకుంటోంది.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం



ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వం. రైతుల గోడును పట్టించుకోదు. పైకి మాత్రం తమది రైతు ప్రభుత్వమని ప్రగాల్భాలతో ప్రచారాలు చేస్తోంది తప్ప ఆచరణలో రైతులకు రిక్త హస్తం చూపుతోంది. ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో టార్గెట్ పూర్తి అయిందని చెప్పి చేసిన జాప్యం వల్లే అన్నదాతలు అధిక వర్షాల వల్ల తడిచిన ధాన్యంతో నేడు రైతులు దైన్యంగా ఉన్నారు.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అన్నదాతకు దన్నుగా కదం..

- రైతు పక్షాన వైఎస్సార్ సీపీ పోరు
- ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యం
- నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష
- జిల్లా వ్యాప్తంగా కదలిన శ్రేణులు
- మద్దతు తెలిపిన రైతు సంఘాలు



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన రిలే దీక్షలో రైతులకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్య ప్రకాష్ తదితరులు

అమలాపురం టౌన్/ఉప్పలగుప్తం: 'ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు దిగుబడి ఆశాజనంగా వచ్చినా అమ్ముకునే దారిలేక నష్టపోవడంపై ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ కన్నెర్రజేసింది. కూటమి ప్రభుత్వ రైతు వ్యతరేక విధానాలపై కదం తొక్కింది. అన్నదాతకు అండగా ఉంటామని, ప్రతి ధాన్యపు గింజా కొనకపోతే ఉద్యమానికి సిద్ధమని' హెచ్చరించింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అమలాపురం కలెక్టరేట్ సమీపంలో బుధవారం వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్ష చేపట్టింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీకి చెందిన కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ రైతు విభాగం నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు ఈ రిలే దీక్షకు మద్దతుగా తరలి వచ్చారు. వారి రాకతో కోటిపల్లి-నర్సాపురం (కేఎస్ఎఫ్) రోడ్డు పార్టీ శ్రేణులు, రైతులతో కిటకిటలాడింది. రైతుల వద్ద కొనుగోలు చేయని ధాన్యం రాశిని, ధాన్యం బస్తాలను శిబిరం వద్ద ఉంచి నిరసన తెలిపారు. ధాన్యానికి లాభసాటి ధర ఇప్పించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు వీడాలని ప్ల కార్డులతో రైతులు, పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని దీక్షా ప్రాంగణంలో ఉంచి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. రైతుల అనుకూల నినాదాలతో దీక్షా ప్రాంగణం హోరెత్తింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిలే దీక్షా శిబిరం జిల్లా వ్యాప్తంగా వచ్చిన పార్టీ శ్రేణులు, రైతులతో దద్దరిల్లింది.

ఈ రిలే దీక్షలో తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లాకు చెందిన మాజీ ఎంపీ చింతా అనూరాధ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మున్సిపల్ చైర్మన్లు రెడ్డి సత్య నాగేంద్రమణి, పతివాడ నూక దుర్గారాణి, గాదంశెట్టి శ్రీదేవి, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మాజీ సభ్యుడు జిన్నూరి బాబి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడు జిల్లెళ్ల రమేష్, జిల్లా పార్టీ పలు విభాగాల అధ్యక్షులు వంగా గిరిజాకుమారి, సాకా ప్రసన్నకుమార్, షేక్ అబ్దుల్ ఖాదర్, మిండగుదటి శిరీష్, తోరం గౌతమ్ రాజా, నెట్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిశోర్, కటకంశెట్టి ఆదిత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే ఇంత చిన్న చూపా



చంద్రబాబు ప్రభుత్వానికి రైతులంటే చిన్న చూపు అనే విషయం ధాన్యం కొనుగోళ్లలో తెలుస్తోంది. లాభసాటి ధరకు అమ్ముకునే పరిస్థితి అన్నదాతకు లేదు. రూ.1,725 మద్దతు ధర ప్రకటించినా రూ.వెయ్యి నుంచి మొదలుపెట్టి రూ.1500 వరకు రైతుల నుంచి కొంటూ దళారులు దోచుకుంటున్నారు.

– గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ కో ఆర్డినేటర్, పి.గన్నవరం నియోజకవర్గం



అమలాపురంలో వైఎస్సార్ సీపీ రిలే దీక్షలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, రైతులు



అన్నదాతలకు భరోసా ఇస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

ప్రభుత్వం దిగి రావాల్సిందే



ధాన్యం అమ్ముకోవడంలో అన్నదాతలు పడుతున్న కష్టాలపై జిల్లా వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుకు కూటమి ప్రభుత్వం దిగి రావాల్సిందే. రైతులకు అండగా నిలచి తాము చేపడుతున్న ఆందోళన ద్వారా ప్రభుత్వం మెడలు వంచుతాం. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా చేస్తాం.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

తడిసిన ధాన్యాన్ని చూస్తే కడుపు తరుక్కుపోతోంది



జిల్లా అంతటా కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని అన్నదాతలు ఎక్కడికక్కడ రోడ్లపై ఆరబెట్టుకుంటున్న దృశ్యాలు చేస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ఈ దయనీయ దృశ్యాలు చూసైనా ప్రభుత్వంలో స్పందన రాకపోవడం విచారకరం. ఇప్పటికైనా రైతుల విషయంలో నటిస్తున్న మొద్దు నిద్ర నుంచి ప్రభుత్వం మేలుకోవాలి. ప్రభుత్వానికి సిగ్గూ శరం ఉంటే రైతుల ఆవేదనను అర్థం చేసుకోవాలి.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్

రైతు నష్టాలను ప్రభుత్వమే పూడ్చాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖరీఫ్ సాగు ముంపుతో, రబీ సాగు ఆరంభం నుంచి వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తీరా పంట చేతికొచ్చే సరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి దళారుల చేతిలో పెత్తనం పెట్టింది. పండించిన ధాన్యాన్ని ఏమి చేయాలో తెలీక మరో పక్క అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు.

– పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పార్టీ కో ఆర్డినేటర్, ముమ్మిడివరం నియోజకవర్గం

దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తోంది



కూటమి ప్రభుత్వం చెప్పే పనులకు, చేతలకు సంబంధం లేదు. ధాన్యం కనీస మద్దతు ధర రూ.1,725 ప్రకటించినప్పటికీ రూ.1,500 చేసి కొంటున్నారు. ప్రభుత్వమే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తునట్లు స్పష్టం అవుతోంది. గ్రామ సచివాలయాల సిబ్బంది రైతును నేరుగా మిల్లర్ల వద్దకు వెళ్లి రేటు మాట్లాడుకోవాలని, అప్పుడే ఆన్‌లైన్ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. వారితో ఒప్పందం చేసుకుంటూనే కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ చేస్తామని చెప్పడం వెనుక మర్మమేమిటో ప్రభుత్వానికే తెలియాలి.

– డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ కో ఆర్డినేటర్, అమలాపురం నియోజకవర్గం

జగన్ ప్రభుత్వంలో మాదిరి కొనుగోళ్లు జరగాలి



గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసినట్లే ఈ ప్రభుత్వం లోనూ కొనాలి. కూటమి ప్రభుత్వం నాణ్యమైన ధాన్యాన్ని కొనడానికి కూడా టార్గెట్ పేరుతో ఆంక్షలు విధిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం గతంలోనే వ్యవసాయం దండగని చెప్పిన మాటలను ఇప్పుడు నిజం చేస్తూ రైతులను చిన్న చూపు చూస్తోంది. జగన్ ప్రభుత్వం పెట్టుబడి సాయంగా రైతు భరోసా అందించేది. ఈ ప్రభుత్వంలో అలాంటి రాయితీలన్నీ గాలికి వదిలేశారు.

– పిల్లి సూర్య ప్రకాష్, పార్టీ కో ఆర్డినేటర్, రామచంద్రపురం నియోజకవర్గం

వాడపల్లిలో అంతా వారిష్టం!



వాడపల్లి క్షేత్రంలో నిర్మించిన ఫ్లై ఓవర్



మాడవీధుల్లో చేపడుతున్న నిర్మాణాలు

- సౌకర్యాల మాటున స్వలాభం
- వాడపల్లి వెంకన్న క్షేత్రంలో నిబంధనలకు తిలోదకాలు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు

కొత్తపేట: జిల్లాలోని వాడపల్లి క్షేత్రంలో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయంలో భక్తులకు కల్పించే వసతులు, సౌకర్యాలు, ఫ్లైఓవర్స్, క్యూలైన్లకు సంబంధించి ప్రతి పనిలో అధికారులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం నియామకం కాకపోయినా పాలకుల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని చెప్పుకొంటున్న ఒక నాయకుడు అనధికార చైర్మన్‌గా పెత్తనం సాగిస్తున్నాడు. అంతా తన కనుసన్నల్లోనే జరగాలన్నట్లు వ్యవహరిస్తున్నారని, దీంతో అధికారులు సిబ్బంది ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారని స్వయంగా అధికార పార్టీ వారితో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన సుమారు 8 ఎకరాల విస్తీర్ణాన్ని ఎలాంటి అనుమతులు, టెండర్లు లేకుండానే రూ.కోట్ల వ్యయంతో మెరగ చేయిస్తున్నారు. ఫ్లై ఓవర్లు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలకు సంబంధించి నిర్మాణాల్లో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతవరకూ పనిచేసిన తాత్కాలిక ఉద్యోగులను తొలగించి తమ అనుయాయులను పలు పోస్టుల్లో నియమించుకుని ఇష్టానుసారం వేతనాలు ఇస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వర్షాలు వస్తే వాహనాలు దిగబడకుండా

వాహనాల పార్కింగ్ స్థలాన్ని నాలుగు అడుగుల మేర మెరక చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చాక టెండర్లు పిలుస్తాం. వర్షాకాలం సమీపిస్తుండడంతో వాహనాలు దిగబడిపోకుండా గోతులు పూడ్చాలని మండలంలోని ఇసుక ర్యాంపుల వారిని కోరాము. వారు మట్టిని ఉచితంగానే తోలి మెరకకు సాయం చేస్తున్నారు. రెండు ఫ్లైఓవర్‌లలో ఒకటి డోనర్ ఇచ్చిన రూ.ఐదు లక్షలతో నిర్మించగా మరొకటి డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూషన్ మేరకు రూ.6 లక్షలతో నిర్మించినట్టు తెలిపారు. వాడపల్లి క్షేత్రంలో అన్ని పనులు నిబంధనలకు అనుగుణంగానే చేస్తున్నట్టు తెలిపారు.

– నల్లం సూర్య చక్రధరరావు, ఈవో

చమురు సంస్థలు మాక్‌డ్రిల్ నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్



తాటిపాక జీసీఎస్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం

అమలాపురం రూరల్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పొంచియున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలోని చమురు, సహజ వాయు నిక్షేపాలు వెలికితీస్తున్న బేస్ కాంప్లెక్స్, చమురు గ్యాస్ నిల్వలు, గ్యాస్ పైప్‌లైన్ల భద్రత కోసం పరిసర గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఓఎన్‌జీసీ వేదాంత, గెయిల్ పైప్ లైన్లు, భద్రత, రక్షణ చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. వైమానిక దాడులు, బాంబు బెదిరింపులు ఎదుర్కొనే దిశగా అత్యవసర సేవలను సిద్ధం చేయాలని తెలిపారు. చమురు, సహజ వాయువుల కార్యకలాపాలు నిర్వహిస్తున్న బేస్ కాంప్లెక్స్‌ల వద్ద తప్పని సరిగా ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్రజలకు భద్రతా చర్యలపై అప్రమత్తం చేయాలని సూచించారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ తాటిపాక, ఓడల రేవు, బోడసకుర్రు ఎస్.యానం తదితర బేస్ కాంప్లెక్స్‌లలో సైబర్ సెక్యూరిటీ, ఐడీ కార్డులు సీసీ కెమెరాల నిఘాలో రాకపోకలు నిర్వహిస్తున్నామని, బేస్ కాంప్లెక్స్ ప్రాంతాలలో నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్ల నిషేధిత ప్రాంతాలుగా ఆంక్షలు విధించామని, ప్రతి కదలికను తెలుసుకునేలా ఆన్‌లైన్ నెట్వర్క్‌ను అమర్చామని తెలిపారు. పైపులైన్ల స్థితిగతులపై తనిఖీ బృందాలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి మధుసూదన్ రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ వీకేవీ ప్రసాద్ చమురు సంస్థల బేస్ కాంప్లెక్స్ ఇంజినీర్లు, సెక్యూరిటీ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాటిపాక జీసీఎస్ వద్ద మాక్ డ్రిల్

మామిడికుదురు: దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై నగరం గ్రామంలోని తాటిపాక జీసీఎస్ వద్ద బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిస్థితులు జటిలంగా మారిన సమయంలో సైరన్ మోగించడం జరుగుతుందని అటువంటి సందర్భాల్లో ఎవరూ బయటకు రాకుండా సురక్షిత ప్రదేశంలోనే ఉండాలని సూచించారు. మళ్లీ సురక్షతమైన సైరన్ మోగించే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలోని జీసీఎస్, గెయిల్ టెర్మినల్, రిఫైనరీ వంటి చమురు ప్రాజెక్టులు ఉన్న నేపథ్యంలో ఇక్కడ ముందస్తుగా మాక్ డ్రిల్ చేపట్టి అటు ఉద్యోగులను, ప్రజల్ని అప్రమత్తం చేశారు. మలికిపురం ఎస్సై సురేష్, ఎమ్మార్వో శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం, రెవెన్యూ, ఓఎన్జీసీ ఉద్యోగులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్కంఠగా అండర్-7 చెస్ పోటీలు

అమలాపురం టౌన్: జిల్లా అండర్-7 చెస్ పోటీలు స్థానిక విక్టరీ అకాడమిలో బుధవారం ఉత్కంఠగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఏడేళ్ల లోపు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్, విక్టరీ అకాడమి ఇన్‌చార్జి తాడి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు జరిగాయి. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన బాలుర, బాలికల విభాగంలో ఐదుగురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-7 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో వారు తలపడనున్నారు. బాలుర విభాగంలో రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామకు చెందిన పాయసం వికాస్ (ప్రథమ), కాట్రేనికోనకు చెందిన విత్తనాల కుశాల్ (ద్వితీయ), అమలాపురానికి చెందిన యతిరాజుల రిషిత్ (తృతీయ) విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన బొడ్డు సాన్వి (ప్రథమ), రావులపాలేనికి చెందిన బి.హిమబిందు (ద్వితీయ) స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

క్లుప్తంగా

ప్రధానిని కించపరచినందుకు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమరాజు

మామిడికుదురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కించపరుస్తూ అభ్యంతరకర, అనుచిత వ్యాఖ్యలు చేసిన గోగన్నమఠం గ్రామం ముత్యాలపాలేనికి చెందిన కర్రి మోహనకనకదుర్గారావును అరెస్టు చేసినట్టు సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సై ఎ.చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. నగరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టుకు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. సోషల్ మీడియాలో పెట్టె ప్రతి పోస్టుపైన రాష్ట్ర, జిల్లా స్థాయిలో సైబర్ పోలీసుల ఆధ్వర్యంలో ఒక వింగ్ పరిశీలిస్తుందన్నారు. అభ్యంతరకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రధానంగా యువత అప్రమత్తంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, అనుచిత వ్యాఖ్యలు పెట్టకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఆకాశ పందిరిలో..

- వేద ఘోష నడుమ వధూవరులైన సత్యదేవుడు అమ్మవారు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఛైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు దంపతులు
- భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికారులు



వధూవరులుగా ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు



పసుపు దంచుతున్న ముత్తయిదువలు

అన్నవరం: సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి వధూవరులైన శుభ తరుణంలో రత్నగిరి పులకించింది. వారం రోజుల పాటు వైభవంగా సాగనున్న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి, బుధవారం సాయంత్రం పండితులు శ్రీకారం చుట్టారు.

సీతారాములే పెళ్లి పెద్దలుగా...

రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా సత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపం వద్దకు తీసుకువచ్చి చూడముచ్చటైన వేదికపై ప్రతిష్ఠించి వధూవరులుగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా, పండితులు వేదాశీస్సులు ఇచ్చారు.

పసుపు దంచిన ముత్తయిదువులు

వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ తదితరుల ఆధ్వర్యంలో ముత్తయిదువులు పసుపు దంచారు.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

ఈ సందర్భంగా రామరాయ కళావేదికపై రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సత్యదేవుడు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని పండితుల హాస్యోక్తులతో వైభవంగా నిర్వహించారు. స్వామివారే గొప్పవారని అమ్మవారి తరపు వారిని తక్కువ చేసేలా మాట్లాడడం, అమ్మవారి తరఫువారు అయ్యవారి తరఫువారికి దీటైన బదులివ్వడం చతురోక్తులతో హృద్యంగా నిర్వహించారు.

నేడు సత్యదేవుని దివ్యకల్యాణం

కాగా, వైశాఖ శుద్ధ ఏకాదశి, గురువారం రాత్రి 9.30 గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవార్ల దివ్యకల్యాణాన్ని వార్షిక కల్యాణవేదికపై ఘనంగా నిర్వహించేందుకు అధికారుల ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తదితర అధికారులను ఆహ్వానించారు.

పటిష్ట ఏర్పాట్లు

స్వామివారి కల్యాణానికి సుమారు 25 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూసేలా వేదిక ముందు టీవీ, స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షింతల ప్యాకెట్లను సర్క్యులర్ మండపంతో పాటు పశ్చిమ రాజగోపురం వద్ద తొమ్మిది చోట్ల పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన భవనంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కొండ మీదకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఉచిత బస్సులను కొండమీదకు నడుపుతున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీటి సరఫరాకు వలంటీర్లు, సేవా కార్యకర్తలను ఏర్పాటు చేశారు. వీఐపీలు, మహిళలు, భక్తులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తునికి చెందిన అగ్ని మాపక శకటాన్ని ఏర్పాటు చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు



అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, 8 గంటలకు చతుర్వేదపారాయణ, 9 అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, దీక్షా వస్త్ర ధారణ. రాత్రి 7 గంటలకు కొండ దిగువన స్వామివారిని వెండి గరుడ వాహనంపై, అమ్మవారిని వెండి గజవాహనంపై, పెళ్లిపెద్దలైన సీతారాములను వెండి పల్లకీపై ఊరేగింపు. అలాగే రాత్రి 9 గంటలకు రత్నగిరి కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అలాగే రత్నగిరి కళావేదికపై, కొండదిగువన ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

టయోటా కిర్లోస్కర్ మోటార్ షోరూమ్ ప్రారంభం



టయోటా కిర్లోస్కర్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణం ముక్తేశ్వరం రోడ్డులో టయోటా కిర్లోస్కర్ మోటారు వాహనాల అధీకృత డీలర్ పృథ్వీ టయోట టీ స్పర్స్ షోరూమ్ బుధవారం ప్రారంభమైంది. ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఈ షోరూమ్‌ను ప్రారంభించి వాహనాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టయోటా ఏరియా మేనేజర్ చమన్ శర్మ, ఎండీ పృథ్వీ చంద్ర, సీఈవో కిరణ్‌కుమార్, జీఎం భాను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాండవలో మహిళ మృతదేహం



తాండవ నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

తుని: స్థానిక కత్రా కొండ పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్ పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై విజయ్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి వయస్సు (50) ఉంటుందని, నీలంరంగు చీర ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలియలేదని, తెలిస్తే తుని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పాపేం చేసింది పాపం!

- ఆడపిల్ల అనా లేక అడ్డుగా ఉందనా!
- సంచలనం రేపిన పసికందు మృతి
- ఘటనపై ఎన్నో అనుమానాలు
- కేసును పక్కదోవ పట్టించేందుకే క్షుద్రపూజల నాటకమా?





బాలిక మృతదేహం లభ్యమైన బావి. (అంతర చిత్రం) మృతి చెందిన బాలిక యశ్వంతి (ఫైల్)

పిఠాపురం: అన్నెంపుణ్యం తెలియని పసిగుడ్డును పొట్టన పెట్టుకున్నారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న పసికందు మృతి, క్షుద్ర పూజల ఆనవాళ్లు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురం జగ్గయ్య చెరువులో నివాసముంటున్న పెదపాటి సతీష్, శైలజ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి యశ్వంతి అనే ఆరునెలల పాప ఉంది. మంగళవారం రాత్రి శైలజ పెద్దమ్మ గంటా మరిడమ్మ పెదనాన్న గంటా రాంబాబులు మేడపై నిద్రించారు. తమ్ముడు పసుపులేటి లోవరాజు, తండ్రి పసుపులేటి దుర్గారావు, తల్లి అన్నవరంలతో కలిసి శైలజ, ఆమె కుమార్తె యశ్వంతి (6 నెలలు) కింద గదులలో నిద్రించారు. రాత్రి 12.30 గంటల సమయంలో పాపకు పాలిద్దామని చూసిన శైలజకు చిన్నారి కనపడకపోవడంతో పెద్దగా కేకలు వేసింది. దీంతో ఇంట్లోని వారందరూ, పక్కింటి వారు కూడా వచ్చి పాప కోసం ఇల్లంతా వెదికారు. చివరకు వారు బావిలో పడి ఉన్న పాపను, ఇంటి గుమ్మం మెట్లపై ఉన్న నిమ్మకాయ, పసుపు, కుంకాలను గమనించారు.

ఘోరానికి ఒడిగట్టిందెవరు..!

ఈ విషయాన్ని బంధువులకు చెప్పేందుకు శైలజ తల్లి అన్నవరం తన సెల్ కోసం వెతికి అది కనిపించకపోవడంతో వేరొక సెల్ నుంచి తన మొబైల్‌కు ఫోన్ చేశారు. ఆ ఫోన్ ఇంటి గోడ అవతల రింగ్ అవుతూ కనిపించింది. దానిని తీసుకుని బంధువులకు విషయాన్ని తెలియజేశారు. సమాచారం అందుకుని అక్కడ చేరుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బావిలోని పాప మృతదేహాన్ని బయటకు తీసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేశారు. పాప అమ్మమ్మ అన్నవరం వద్దకు వెళ్లి నిలవడంతో పాటు ఆమె ఫోన్ నూతి పక్కన దొరకడం అనుమానాలకు తావిచ్చింది. దీంతో పోలీసులు అన్నవరంను, ఆమెతో పాటు, కొందరు కుటుంబ సభ్యులను అనుమానితులుగా విచారిస్తున్నారు. శైలజ యానాదులు కాగా తండ్రి సతీష్ ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన వారని స్థానికులు తెలిపారు. వీరి ప్రేమ వివాహం నచ్చని శైలజ కుటుంబ సభ్యులు బాలిక మృతికి కారణమై ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్



ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్

క్షుద్ర పూజలు నాటకమేనా

ఆడ పిల్ల అనో, లేక అడ్డుగా ఉందనో పసికందును పొట్టన పెట్టుకున్న అగంతకులు ఎవరికీ అనుమానం రాకుండా క్షుద్ర పూజలు జరిగినట్లు చిత్రీకరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. కుంకుమ, పసుపు నమూనాలు సేకరించి, ఇంటిలో ఉన్న పసుపు కుంకుమ ఒకటేనా అని పరిశీలించారు. కేసును తప్పుదోవ పట్టించడానికే క్షుద్ర పూజల నాటకం ఆడి ఉంటారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి అమ్మమ్మ, తాతయ్య, మేనమామ, తండ్రి తదితరులను అనుమానితులుగా విచారిస్తున్నారు.

బంతితో ఆడుతూ బావిలోకి..

- ఏడేళ్ల బాలుడి మృతి
- అయోధ్యరామపురంలో విషాదం



బావిలో పడి మృతి చెందిన హేమంత్

సామర్లకోట: బంతితో ఆడుతూ పొరపాటు బావిలో పడి ఒక చిన్నారి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం అయోధ్యరామపురానికి చెందిన చెవా హేమంత్ (7) బుధవారం సాయంత్రం తన ఇంటి సమీపంలో బంధువుల ఇంటి వద్ద బంతితో ఆడుతూ బావి సమీపంలోని సిమెంటు దిమ్మ ఎక్కాడు. బంతి బావి వైపు పోవడంతో దానిని అందుకునే క్రమంలో ఆ చిన్నారి బావిలో పడిపోయాడు. సుమారు 60 అడుగుల లోతులో బావి ఉండడంతో స్థానికులు దిగలేకపోయారు. దాంతో విద్యాకమిటీ ఛైర్మన్ నక్కా జానికిరామయ్య పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది బావిలోనికి దిగే ప్రయత్నం చేశారు. అయితే వారి వద్ద లైట్ లేక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు లైట్ ఏర్పాటు చేయడంతో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు బావిలోనికి దిగారు. బాలుడు బావిలోనికి పడిన సమయంలో అతని తలకు గాయం తగలడం, సుమారు రెండు గంటల సేపు బావిలో ఉండిపోవడంతో మృతి చెందాడు. బాలుడి తండ్రి సతీష్ ఏడీబీ రోడ్డులోని ఒక రెయ్యల చెరువు వద్ద పని చేస్తూ ఉంటాడు. తల్లి రాధ గృహిణి. హేమంత్ తాత సుబ్బారావు సాయంత్రం 6 గంటల సమయంలో ముంజులు తీసుకు వచ్చి తినరా అంటే ఇప్పుడే రెండు నిమిషాలల్లో వస్తానని చెప్పి వెళ్లిన మనవడు ఐదు నిమిషాలలో బావిలో పడిపోయాడనే వార్త వినాల్సి వచ్చిందని గుండెలు బాదుకుంటూ రోదించాడు. ఎస్సై మూర్తి తన సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈజీ మనీ కోసం వ్యసనాల బాట

- దొంగతనం కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: చెడు వ్యసనాలకు బానిసలైన యువకులు ఈజీ మనీ కోసం దొంగతనాల బాట పట్టి జైలు పాలయ్యారు. అయినా వారిలో మార్పు రాలేదు. జైలులో ఏర్పడిన పరిచయాలతో ముఠాగా ఏర్పడి తిరిగి దొంగతనాలకు పాల్పడి స్థానిక పోలీసులకు చిక్కారు. ఎస్సై డి.సురేష్‌బాబు బుధవారం తెలిపిన వివరాల మేరకు. రాయవరానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ శెట్టి చిన్నికృష్ణ గత నెల 30న రామచంద్రపురం ఎల్ఐసీ కార్యాలయానికి బయలుదేరాడు. పసలపూడి వంతెన వద్దకు వచ్చే సరికి బండి పెట్రోల్ ట్యాంకుపై పెట్టుకున్న బ్యాగ్‌ను మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఆ బ్యాగ్‌లో రూ.70వేల నగదు, ఎల్ఐసీ బ్యాండు పేపర్లు, ఐడీ కార్డు జెరాక్సులు ఉన్నాయి. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్సై సురేష్‌బాబు విచారణ చేపట్టి పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు బీసీ కాలనీకి చెందిన దత్తు అలియాస్ దత్తి నవీన్ (ప్రస్తుతం ఏలూరు పట్టణంలో తంగెల్లముని వాసి), ఏలూరు పట్టణం జేవీఆర్ నగర్, గవరవరానికి చెందిన కోనాల రవితేజ, అనపర్తి మండలం పాలమూరు గ్రామంలోని మహేంద్రవాడరోడ్‌కు చెందిన నల్లమిల్లి ఆదిత్యరెడ్డి, ఏలూరు పట్టణం ఫిరంగుల దిబ్బ, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన దండూరి సాయిరాజు, అదే గ్రామానికి చెందిన నడుపూరు కల్యాణ్‌లను నిందితులుగా గుర్తించారు. లొల్ల గ్రామంలోని వెంకటేశ్వర బ్రిక్స్ ఇండస్ట్రీ ఎదురుగా కుతుకులూరు నుంచి లొల్ల వచ్చే రహదారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై వస్తూ పోలీసులకు చిక్కారు. వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, రూ.54 వేల నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, హెచ్‌సీ సత్యకుమార్, పీసీలు వీరేంద్ర, విజయ్, సత్యకుమార్‌లను ఎస్పీ కృష్ణారావు అభినందించినట్లు ఆయన తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ఓపెన్ స్కూల్ సంచాలకుడు ఆర్.నరసింహారావు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

పరీక్షలు ఇలా..

తేదీ	పదవ తరగతి	ఇంటర్
మే 19	హిందీ	ఇంగ్లిషు
మే 20	ఇంగ్లిషు	హిందీ, తెలుగు, ఉర్దూ
మే 21	తెలుగు, ఉర్దూ, కన్నడ ఒరియా, తమిళం	కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సామాజికశాస్త్రం
మే 22	గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం	ఫిజిక్స్, సివిక్స్/పౌరశాస్త్రం మనో విజ్ఞానశాస్త్రం
మే 23	శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం.	గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం
మే 24	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	జీవశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం

గోమాతలో క్షీరసాగరం!

- అధిక పాలనిచ్చి అబ్బురపరచిన ఆవు
- రోజుకు 21.19 లీటర్లు పాల దిగుబడి





ఆవుతో మురళీకృష్ణ. (అంతర చిత్రం) 11.52 లీటర్లు తూగిన ఉదయం ఇచ్చిన పాలు

కపిలేశ్వరపురం (మండపేట): సాధారణంగా స్వదేశీ ఒంగోలు ఆవు ఉదయం, సాయంత్రం నాలుగు లీటర్ల చొప్పున రోజుకు సుమారుగా 8 లీటర్ల పాలని స్తాయి. దానికి భిన్నంగా మండపేట పట్టణానికి చెందిన పాడి రైతు వేగుళ్ల మురళీకృష్ణ సంరక్షణలోని ఒంగోలు జాతి పాడి ఆవు రోజుకు ఏకంగా 21.19 లీటర్లు పాలనిచ్చింది. ఆ విషయాన్ని మండపేటలోని కేంద్రీయ పశు నమోదు పథకం స్టాక్‌మేన్ డి.రాజేశ్వరావు నిర్ధారించారు. ఆయన పర్యవేక్షణలో మంగళవారం ఆవు నుంచి పాలను పితకగా ఉదయం 11.52 లీటర్లు, సాయంత్రం 9.67 లీటర్లు మొత్తం 21.19 లీటర్లు పాల ఇచ్చింది. ఈ స్థాయిలో పాలనివ్వడం ప్రత్యేకత కలిగినదేనని రాజేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది జనవరిలో రాజోలు సమీపంలో నిర్వహించిన పాల పోటీల్లో మొదటి బహుమతి పొందిన ఆవు 18 లీటర్లు, ద్వితీయ బహుమతి పొందిన ఆవు 16 లీటర్లు పాలు ఇచ్చాయన్నారు. వాటన్నింటి రికార్డులను చెరిపేస్తూ మండపేటలోని ఈ ఆవు 21.19 లీటర్లు పాలనిచ్చింది.

రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ పోర్టుకు తరలిస్తున్న సుమారు 28.6 టన్నుల రేషన్ బియ్యాన్ని ఏపీ 39 యూడీ 6507 లారీపై తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో తమ్మయ్యపేట జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. లారీ ప్రయాణిస్తున్న నల్లజర్లకు చెందిన వినాయక ట్రేడర్స్ ప్రతినిధి మద్దు సత్యనారాయణ మూర్తి, లారీ డ్రైవర్ గొలుసు శంకరరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. నిల్వ విలువ రూ.29 లక్షలు ఉంటుందన్నారు.


చిత్రం మనోహరం!

- పెన్సిల్ ఆర్ట్‌లో అందెవేసిన చేయి
- చూసిన దృశ్యాన్ని పేపర్‌పై పెట్టే నేర్పు
- చిత్రకళతో ఆకట్టుకుంటున్న వైనం

పిఠాపురం: చూసిన దృశ్యాన్ని, అంశాన్ని మనోఫలకంపై బంధించి కాన్వాసుపై గీయడంలో నేర్పరి ఈ బాలుడు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న బొమ్మలను సరదాగా గీయడంతో అలవాటైన చిత్రకళను సాధనతో పరిపుష్టం చేసుకున్నాడు అతడు. ప్రొఫెషనల్ చిత్రకారుడిగా గుర్తింపు పొందడమే లక్ష్యమంటున్న కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన పట్నాల వెంకట శ్రీసాయి మనోహర్ ఈ చిత్రకళలో ఎన్నో షీల్డులు గెలుచుకుంటున్నాడు. అదీ ఇదీ అనికాదు.. దేశ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులు, దేవతామూర్తులు ఇలా ఏది చూసినా ఇట్టే పేపర్‌పై గీసే నైపుణ్యం సాధించాడు. పటాన్నల ఈశ్వరరావు, వీర వెంకటలక్ష్మి దంపతుల కుమారుడైన మనోహర్ ఆరో తరగతి నుంచి ప్రారంభించిన అభ్యాసం ప్రస్తుతం 9వ తరగతిలోకి అడుగుపెట్టడం వరకు మరింత తన కళకు సానబట్టాడు.



మనోహర్ సాధించిన ప్రశంసాపత్రాలు, షీల్డులు



మాతో పెట్టుకుంటే రక్త సిందూరమే (పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడికి నిదర్శనంగా మనోహర్ గీసిన చిత్రం)



పెన్సిల్‌తో మనోహర్ గీసిన అయోధ్య రాముని చిత్రం

పెదనాన్న గీసిన డిజైన్లు చూసి

మాది వడ్రంగి కుటుంబం. మా పెదనాన్న పట్నాల సీతాంబరం, మానాన్న పట్నాల ఈశ్వరరావు చేతితోనే డిజైన్లు చెక్కేవారు. కాగితంపై వారు గీచిన డిజైన్‌ను చెక్కపై అతికించి తదనుగుణంగా వుడ్ వర్క్ చేసేవారు. వారి పనితనం చూసి ఆసక్తి కలిగి ఈ కళను నేర్చుకున్నాను. ప్రముఖ చిత్రకళాకారులు, వారి చిత్రాలను పలు పుస్తకాల ద్వారా తెలుసుకున్నాను. కేవలం పెన్సిల్ తోనే చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్నా. అవసరమైతే తప్ప రంగులద్దను. నేను గీసిన చిత్రాలకు ఎన్నో ప్రశంసలు, బహుమతులు వచ్చాయి. యూట్యూబ్‌లో ఒక చిత్రకారుడు ఎదురుగా ఉన్న మనిషిని అక్కడికక్కడే బొమ్మ గీసి ఇవ్వడం చూసి నేనూ సాధన చేశారు. తక్కువ సమయంలో ఎదుటి దృశ్యాన్ని గీయడానికి సాధన చేస్తున్నా. మంచి చిత్రకారుడిగా పేరు పొందాలని, డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరి అందరికి చిత్రలేఖనంపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– పట్నాల వెంకట శ్రీసాయి మనోహర్

